సాక్షి ప్రకాశం

బుధవారం । 2 । అక్టోబర్ । 2024



పశ్చిమాన గంజాయి గబ్బు

పశ్చిమ ప్రకాశానికి ముఖ్య కేంద్రమైన మార్కాపురం గంజాయికి అడ్డాగా మారింది. గత 20 రోజుల్లో 50 కేజీల గంజాయిని పట్టుకున్నారు.

- 10లో..



ఆత్మగౌరవం దెబ్బతీస్తే సహించం

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు హెచ్చరించారు.

- 10లో..

గరిష్టం/కనిష్టం
36.5/27.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- జిల్లా ప్రజారవాణాఅధికారి బి.సుధాకరరావు

ఒంగోలు: దసరా సందర్భంగా ఈ ఏడాది ప్రయాణికుల సౌకర్యార్థం 136 సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి బి.సుధాకరరావు మంగళవారం మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది హైదరాబాద్‌కు 120 సర్వీసులకుపైగా నడపారని, ఈ ఏడాది 136 సర్వీసులు నడపాలని నిర్ణయించామన్నారు. ఈ సర్వీసులు ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. బెంగళూరు నుంచి 8, చెన్నై నుంచి 5 సర్వీసులను ముందస్తుగా ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా లేదా సమీపంలోని ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్ (ఏటీబీ) ఏజెంట్ల ద్వారా కానీ ముందస్తుగా రిజర్వేషన్ పొందవచ్చన్నారు. రానుపోను ఒకేసారి టికెట్ రిజర్వు చేసుకున్న వారికి 10 శాతం రాయితీ సదుపాయం కూడా ఉందని, ఆన్‌లైన్‌లో 60 రోజుల ముందుగానే రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. ఏసీ స్లీపర్, నాన్ ఏసీ స్లీపర్ సర్వీసులు కూడా సాధారణ చార్జీలతో నడుపుతామని, ప్రయాణికులంతా అధిక ధరలు వసూలు చేస్తున్న ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా, భద్రతకు మారుపేరు అయిన ఆర్టీసీ సర్వీసులను ఆదరించాలని కోరారు. డిపో వారీగా బస్సుల వివరాలను పరిశీలిస్తే ఈనెల 8న 14 సర్వీసులు, 9న 27 సర్వీసులు, 10న 40 సర్వీసులు, 11న 55 సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. గిద్దలూరు డిపో నుంచి 24, కనిగిరి నుంచి 33, మార్కాపురం నుంచి 22, ఒంగోలు నుంచి 40, పొదిలి నుంచి 17 వెరసి జిల్లావ్యాప్తంగా 136 సర్వీసులు నడపనున్నారు. వీటిలో ఇంద్ర 5, సూపర్ లగ్జరీ 50, అల్ట్రాడీలక్స్ 52, ఎక్స్‌ప్రెస్ 29 సర్వీసులు ఉన్నట్లు వివరించారు.

ఫ్రీ హోల్డింగ్ ప్రక్రియ నెలాఖరుకు పూర్తి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: జిల్లాలో జరుగుతున్న భూముల ఫ్రీ హోల్డింగ్ ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తమీమ్ అన్సారియా రెవెన్యూ శాఖ మంత్రికి తెలిపారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, సీసీఎల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాలు కలెక్టర్లతో పలు అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ డీఐజీ పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, కలెక్టరేట్ ల్యాండ్ విభాగం అధికారులు పాల్గొన్నారు. దీనిలో కలెక్టర్ జిల్లాలోని ఫ్రీహోల్డింగ్ ప్రక్రియపై వివరించారు. ఫ్రీహోల్డింగ్ పరిశీలన త్వరగా పూర్తి చేసేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

జిల్లా ఎంపీటీసీల సంఘ అధ్యక్షుడిగా ఆకుపాటి



డా. ఆకుపాటిని అభినందిస్తున్న ఎంపీటీసీల సంఘం నాయకులు

ఒంగోలు టౌన్: జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడిగా పామూరు ఎంపీటీసీ డా.ఆకుపాటి వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మల్లయ్యలింగం భవనంలో మంగళవారం నిర్వహించిన ఎంపీటీసీల చైతన్య సదస్సులో నూతన కమిటీ ఎంపిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా కొత్తపట్నం ఎంపీటీసీ ఆర్.వెంకటరావు, ఉపాధ్యక్షునిగా మద్దిపాడు మండలంలోని లింగంగుంట్ల ఎంపీటీసీ మన్నం కృష్ణ కిశోర్, పమిడి నాగేశ్వరరావు, కార్యదర్శిగా అల్లూరు ఎంపీటీసీ శాంతారావు, వర్కింగ్ ప్రసిడెంట్‌గా అర్ధవీడు మండలం యాచారం ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ నన్నెబోయిన రవి కుమార్‌లను ఎన్నుకున్నారు. ఎం.చిన పుల్లమ్మ, రాఘవరెడ్డి, నాగభూషణంలను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చైతన్య సదస్సులో నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి జి. వీరభద్రాచారి మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నికైన ఎంపీటీసీలను ప్రజా ప్రతినిధులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ఇచ్చిన అధికారాలను ఇవ్వకుండా ఎమ్మెల్యేలకే అన్నీ రకాల అధికారాలను కట్టబెడుతున్న ప్రభుత్వాల వైఖరి సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీటీసీలకు ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి పలువురు ఎంపీటీసీలు హాజరయ్యారు.

పచ్చని కాపురం కూల్చే మద్యం

పేదల పచ్చని కాపురాలు కూల్చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. తెలుగు తమ్ముళ్ల జేబులు నింపేందుకు అడుగులు వేస్తోంది. పేదల బతుకులు ఏమైనా పర్వాలేదు.. పచ్చ నేతల ఖజానాలు నిండితే చాలన్నట్లుగా వ్యవహరిస్తోంది. పేదల సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేసి తక్కువ ధరకే మద్యం అంటూ నిస్సిగ్గుగా బంపరాఫర్ ప్రకటిస్తోంది. కొత్త ఎక్సైజ్ పాలసీతో ప్రైవేట్ మద్యం దుకాణాలకు తలుపులు బార్లా తెరిచింది. కొత్త నోటిఫికేషన్ రాకముందే పచ్చ నేతలు సిండికేట్ల అవతారం ఎత్తారు. ఎక్సైజ్ కార్యాలయంలో హడావుడి చేస్తున్నారు. ఈఎస్ కంటే ముందే కార్యాలయానికి వచ్చేస్తున్నారు. బదిలీల్లో చక్రం తిప్పుతున్నారు. తమ కనుసన్నల్లో పనిచేసే వారికి పోస్టింగ్‌లు ఇప్పించుకుంటున్నారు. ఇప్పటికే వీధివీధికీ బెల్టు షాపులు వచ్చేశాయి. జిల్లాలో తాగడానికి గుక్కెడు నీళ్లు దొరక్కపోయినా మద్యం మాత్రం ఏరులై పారనుంది.



కూటమి బంపరాఫర్

- క్వార్టర్ రూ.99లే
- తాగినోడికి తాగినంత
- ఇప్పటికే వీధివీధికీ బెల్టు షాపులు
- జిల్లాలో సిండికేటుగాళ్ల హడావుడి
- మద్యం దుకాణాలన్నీ తమ్ముళ్లకే పందేరం
- ఎక్సైజ్ కార్యాలయంలో చక్రం తిప్పుతున్న నేతలు
- ప్రభుత్వ నిర్ణయంపై మహిళా సంఘాల ఆగ్రహం

ఒంగోలు టౌన్: మద్యం మహమ్మారితో నిరుపేద, మధ్య తరగతి కాపురాల్లో శాంతి లేకుండా పోతుందని ఎప్పటి నుంచో మహిళా సంఘాలు ఘోషిస్తున్నాయి. మహిళలపై హింస జరగడానికి ప్రధాన కారణం మద్యమేనన్నది నూటికి నూరుశాతం నిజం. దానికి తోడు మద్యం తాగి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య కూడా ఎక్కువే. ఇప్పుడు తాగినోళ్లకు తాగినంత మద్యం తాగించడం వలన జరిగే నష్టాలకు, కష్టాలకు ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా అని మహిళా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

జిల్లాలో 171 దుకాణాలు:

జిల్లాలో మొత్తం 171 షాపులు ఏర్పాటు కానున్నాయి. ఒంగోలు పట్టణంలో 20 మద్యం దుకాణాలు ఉండగా ఇప్పుడు వాటిని అలాగే కొనసాగించనున్నారు. గతంలో ఒంగోలు రూరల్‌లో ఉన్న దుకాణాన్ని తొలగించారు. కొత్తపట్నంలోని 5 దుకాణాలు, నాగులుప్పలపాడులో గతంలో 7 దుకాణాలకు గాను ఇప్పుడు 5 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. టంగుటూరు 6 దుకాణాలకు గాను 4, చీమకుర్తి రూరల్లో 5కు గాను 4, మద్దిపాడు 6కు గాను 3, సంతనూతలపాడు 6కు గాను 4 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. సింగరాయకొండ 8కి గాను 6, కొండపి 4కు గాను 3, పొదిలి నగర పంచాయతీ 6కు గాను 5, దర్శి, గిద్దలూరు 6కు గాను 5 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. అయితే గతంలో పొదిలి రూరల్లో ఒక్క మద్యం దుకాణం కూడా లేదు. ఇప్పుడు 2 దుకాణాలకు లైసెన్స్ ఇవ్వనున్నారు. చీమకుర్తి నగర పంచాయతీలో 4 దుకాణాలకు గాను 5 దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు. దర్శి రూరల్లో గతంలో 1 షాపు వుండగా ఇప్పుడు ఏకంగా 4 దుకాణాలకు లైసెన్సు ఇవ్వనున్నారు. మొత్తం మీద కొన్ని చోట్ల తగ్గించి, మరి కొన్ని చోట్ల పెంచనుండడం గమనార్హం.



టంగుటూరులో మద్యం దుకాణం వద్ద గుమికూడిన మందుబాబులు

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ...

మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 11వ తేదీ లాటరీ తీస్తారు. 12వ తేదీ నుంచి కొత్త దుకాణాలు వ్యాపారం ప్రారంభించాల్సి ఉంది. కొత్త దుకాణాలు తెరిచే వరకు పాత దుకాణాలు కొనసాగుతాయని ప్రభుత్వం చెబుతోంది. కానీ అలాంటి పరిస్థితి ఏమీ కనిపించడంలేదు. గతంలో దరఖాస్తులో మద్యం దుకాణం ఏర్పాటు చేసే ప్రాంతం చిరునామాను పేర్కొనేవారు. ఇప్పుడు అలా ఆ పద్ధతిని మార్చి వేశారు. లైసెన్సు పొందిన వారు గ్రామంలో ఎక్కడైనా దుకాణం ఏర్పాటు చేసుకునే వెసులుబాటును కల్పించింది. జనాభాను బట్టి నాలుగు రకాల రుసుమును నిర్ణయించింది. తొలి ఏడాది తరువాత రెండో ఏడాది ఈ రుసుమును 10 శాతం వరకు పెంచనుంది. అయితే ఈ రుసుమును ఒకేమొత్తంలో చెల్లించాల్సిన అవసరం లేదు. ఆరు విడతల్లో చెల్లించవచ్చని చెబుతోంది. రిటైల్ వ్యాపారం చేసే లైసెన్సుదారుకు 20 శాతం మేర మార్జిన్.

పశ్చిమాన మంచినీళ్లు లేవు.. మద్యం బోలెడంత..

పశ్చిమ ప్రకాశం జిల్లాలో అనేక గ్రామాల్లో మంచినీరు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మార్కాపురం, దోర్నాల, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పెదారవీడు గ్రామాల్లో ప్రజలు మంచినీటి కొరతతో బాధ పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలు మంచినీరు కావాలని అడుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మద్యం సరఫరా చేస్తానంటోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యర్రగొండపాలెంలో 5, దోర్నాలలో 3, పెద్దారవీడులో 3, త్రిపురాంతకంలో 5, పుల్లల చెరువులో 3, మార్కాపురంలో 4, మార్కాపురం రూరల్‌లో 2 మద్యం దుకాణాల ద్వారా మద్యం పంపిణీ చేస్తాం, హాయిగా గొంతులు తడుపుకోండని చెబుతోందని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు.

99తో నాణ్యమైన మద్యం సాధ్యమా ?

కేవలం 99 రూపాయలకే నాణ్యమైన బ్రాండెడ్ మద్యం సరఫరా చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలపై సామాన్యుడికి నమ్మకం కలగడం లేదు. మద్యం దుకాణలకు లైసెన్సులు మంజూరు చేయడానికే రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ రుసుం వసూలు చేయనుంది. ఆ తరువాత ఏడాదికి కనీస రుసుం రూ.50 లక్షల నుంచి రూ.85 లక్షలుగా నిర్ధారించింది. ఇక దుకాణాల అద్దెలు, అడ్వాన్సులు మొత్తం కలిపి వ్యాపారస్తులకు తడిసి మోపెడవుతుంది. ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టిన వ్యాపారులకు ప్రభుత్వం ఇచ్చే మార్జిన్ కేవలం 20 శాతం మాత్రమే. అంటే 99 రూపాయలకు ఒక క్వార్టర్ మద్యం విక్రయిస్తే వారికి వచ్చేది కేవలం 20 రూపాయలే. అంటే ప్రభుత్వం చెబుతున్న నాణ్యమైన మద్యం అనేది కేవటం గారడీ మాత్రమే అని విశ్లేషిస్తున్నారు.

సిండికేట్ల హవా..

జిల్లాలో ఎక్కడ చూసినా సిండికేటుగాళ్ల హవా కనిపిస్తోంది. కలెక్టరేట్ వద్ద ఎప్పుడు చూసినా ధర్నాలు, నిరసనలతో ప్రజా సంఘాల హడావుడి కనిపించేది. దానికి భిన్నంగా మంగళవారం కార్లలో వచ్చిన మద్యం వ్యాపారుల సందడి కనిపించింది. ప్రకాశం భవనంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో పచ్చ తమ్ముళ్లకు గిరాకీ పెరిగింది. టీడీపీ నేతలు ఈఎస్ కంటే ముందే కార్యాలయానికి వచ్చి కూర్చుంటున్నారు. బదిలీల్లో చక్రం తిప్పుతున్నారు. తమ కనుసన్నల్లో పనిచేసే సీఐలు, ఎస్‌ఐలకు తమ ప్రాంతాల్లో పోస్టింగులు ఇప్పించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలకు సోమవారం అర్ధరాత్రి నోటిఫికేషన్ విడుదల చేయడంతో జిల్లాలోని అన్నీ దుకాణాలను తమ గుప్పిట్లోకి తీసుకునేందుకు ఎమ్మెల్యేలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఇతర వ్యాపారస్తులు ఎవరూ దరఖాస్తులు చేసుకోవద్దని హుకుం జారీ చేస్తున్నారని తెలుస్తోంది. ఒక వేళ దరఖాస్తు చేసుకున్నా తరువాత ఇబ్బందులు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ఉద్యోగాల సంగతేంటి చంద్రన్న...

గత ప్రభుత్వం మద్యం దుకాణాల్లో పనిచేసేందుకు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్ మెన్‌లను ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించింది. నెల నెలా జీతాలు ఇచ్చి ఉపాధి చూపించింది. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన తరువాత ఈ ఉద్యోగాలు కూడా త్రిశంకు స్వర్గంలో ఉన్నాయి. జిల్లాలో 178 మద్యం దుకాణాలకు గాను 534 మంది ఉద్యోగాలు చేసుకుంటూ బతుకుబండిని నడుపుకునేవారు. ఇప్పుడు వారి విషయంలో ఏం చేస్తారో ప్రభుత్వం చెప్పడం లేదు. వలంటీర్ల లాగే వీరికి కూడా మొండిచేయి ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పెండింగ్ జీతాలు ఇవ్వాల్సి ఉంది. అదికూడా చెల్లించలేదు. తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి తమ పొట్టలు కొడుతోందని వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని ఉద్యమబాట పడుతున్నారు.

పార్టీ బలోపేతమే మనందరి లక్ష్యం

- 4వ తేదీ నియోజకవర్గం నుంచి ప్రతి కార్యకర్త, అభిమాని తరలివచ్చేలా కృషిచేద్దాం
- నూతన జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డిని ఘనంగా స్వాగతించుకుందాం
- మాజీ మంత్రి మేరుగు నాగార్జున



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

ఒంగోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే మనందరి లక్ష్యం అని మాజీ మంత్రి, సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని ముఖ్యనాయకులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ ఈనెల 4న దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపడుతున్న తరుణంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరూ తరలివచ్చేలా కృషిచేద్దామని పిలుపునిచ్చారు. సంతనూతలపాడు అంటేనే సొంత నియోజకవర్గంగా భావించే శివప్రసాదరెడ్డిని ఘనంగా స్వాగతించుకుందామన్నారు. దాతృత్వానికి మారుపేరులా ఉండే బూచేపల్లి కుటుంబం అంటేనే జిల్లాలో ఒక ప్రత్యేక అభిమానం ప్రతి ఒక్కరిలో ఉంటుందని, అటువంటి బూచేపల్లి శివప్రసాదరెడ్డి అధ్యక్షునిగా వైఎస్సార్ సీపీని బలోపేతం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా మండలాల్లో పరిస్థితిని గురించి పలువురు ముఖ్య నాయకుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం పార్టీ పట్ల ప్రజల్లో ఒక సానుకూల దృక్పథం కనిపిస్తుందని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు బహిర్గతపరుస్తూ వాటి పరిష్కారానికి ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు కృషిచేద్దామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ జి.చంద్ర, చీమకుర్తి నగర, మండల అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రవణమయ్య, ఎంపీపీ విజయ, మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, మద్దిపాడు ఎంపీపీ వాకా కోటిరెడ్డి, మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నలమాలపు కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, వైఎస్సార్ సీపీ ముఖ్యనాయకులు కర్నాటి ప్రసాద్, కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, బొట్ల సుబ్బారావు, సంతనూతలపాడు నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కూటమి నేతలకే జై..ప్రొటోకాల్ నై..

- వయోవృద్ధుల దినోత్సవంలో అధికారుల అత్యుత్సాహం
- ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కేవలం జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేల ఫొటోలు మాత్రమే
- కనిపించని కలెక్టర్, జెడ్పీ చైర్మన్, దర్శి, వైపాలెం ఎమ్మెల్యేల ఫొటోలు, పేర్లు



కలెక్టరేట్‌లో ప్రొటోకాల్ పాటించకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ఒంగోలు అర్బన్: జిల్లా యంత్రాంగం కూటమి నేతలకు జై కొడుతున్నారు. ప్రభుత్వం తరఫున ఏ కార్యక్రమం జరిగినా ప్రొటోకాల్‌ను పాటించకుండా కేవలం పచ్చ నేతలకే పెద్ద పీట వేస్తున్నారు. మంగళవారం విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆ కార్యక్రమానికి కలెక్టరేట్‌లో ప్రధాన గేటు నుంచి కార్యక్రమం నిర్వహించే భవనం వరకు అరడజను పెద్ద పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ఆ ఫ్లెక్సీల్లో సైతం కేవలం టీడీపీ నేతల ఫొటోలను మాత్రమే ముద్రించి యంత్రాంగం నేతల మెప్పు పొందేందుకు అత్యుత్సాహం చూపారు. ఫ్లెక్సీల్లో సీఎంతో పాటు మంత్రి స్వామి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ మాగుంట, స్థానిక ఎమ్మెల్యే దామచర్లతో పాటు కనిగిరి, మార్కాపురం, ఎస్ఎన్ పాడు, గిద్దలూరు ఎమ్మెల్యేలు, మేయర్ ఫొటో ముద్రించారు.

కనిపించని జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్మన్, దర్శి, వైపాలెం ఎమ్మెల్యేల ఫొటోలు, పేర్లు:

ఆ ఫ్లెక్సీల్లో కనీసం కలెక్టర్ తమీమ్ అన్సారియా పేరు కానీ, ఫొటో కానీ కనిపించకపోవడం విశేషం. అంతేకాకుండా జిల్లా ప్రథమ మహిళ అయిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఫొటో, పేరు కూడా లేకపోవడం మహిళలకు ఏ పాటి గౌరవం దక్కుతుందో అర్థమవుతోంది. వీరితో పాటు దర్శి, యర్రగొండపాలెం ఎమ్మెల్యేల ఫొటోలు, పేర్లు కూడా లేవు. ఆ నియోజకవర్గాలు మన జిల్లాలో లేవని భావించారో లేక వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలని పక్కన పెట్టారో అధికార యంత్రాంగానికే తెలియాలి. అధికార యంత్రాంగం ప్రొటోకాల్ పాటించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం పోరాటం

- నవంబరులో పది లక్షల మందితో ఒంగోలులో బహిరంగ సభ
- ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు



మాట్లాడుతున్న గద్దపాటి విజయరాజు

ఒంగోలు: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని పోరాడతామని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీవో భవన్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా పాస్టర్ల సంఘం సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వకుండా అందని ద్రాక్షగా చేశాయన్నారు. ప్రస్తుతం ఈ విషయమై వేసిన కేజీ బాలకృష్ణన్ కమిటీ చైర్మన్ జస్టిస్ కేజీ బాలకృష్ణని తాను స్వయంగా గంటన్నరపాటు ఆయన నివాసంలో కలిసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, దానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వానికి రికమండేషన్ సమర్పించాలని కోరినట్లు చెప్పారు. దళిత క్రైస్తవులను చైతన్యపరిచి ఎస్సీ హోదా సాధన వైపు ఏకతాటిపై నడిపించేందుకు భవిష్యత్ కార్యాచరణ సిద్ధపరచడానికి నవంబరులో పది లక్షల మందితో ఒంగోలులో బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. మనదేశంలోని అగ్రకులాల వారు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే వారు ఓసీలుగానే పరిగణిస్తారని, బీసీలు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే బీసీలు గానే, ఎస్టీలు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే ఎస్టీలుగానే పరిగణిస్తారని, కానీ 75 ఏళ్లుగా దళితులు క్రైస్తవ మతాన్ని స్వీకరించినట్లయితే ఎస్సీలుగా పరిగణించకుండా అన్యాయం చేస్తూనే ఉన్నారన్నారు. మతం మారినా కులం మారదని, వారి ఆర్థిక రాజకీయ సామాజిక స్థితిగతుల్లో మార్పు ఉండదని తెలిసినా అన్యాయం కొనసాగుతూనే ఉందన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని పది లక్షల మందితో సంతకాల సేకరణ చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కూడా నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏ నాగేంద్ర కుమార్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బిషప్ సాంసన్, పాస్టర్ యూనియన్ ప్రెసిడెంట్ బ్రదర్ ఎస్ ఐజక్ బాబు, మన్న చర్చి సుదర్శన్, పాలపర్తి విజేష్ రాజు, ప్రసాద్ బాబు, లివింగ్ స్టన్, కొడవటిగంటి సామ్రాట్, ఈ శామ్యూల్ కృపాకర్, ఎద్దు శశి భూషణ్ గారు, స్టూడెంట్ జేఏసీ అధ్యక్షుడు రాయపాటి జగదీష్, దళిత్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

ఒకేచోట పింఛన్ల పంపిణీ

- టీఎన్‌టీయూ ప్రకాశం జిల్లా అధ్యక్షుడి నిర్వాకం



శానంపూడిలో ఒకేచోట పింఛన్లు పంపిణీ చేస్తున్న టీఎన్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

ఒంగోలు టౌన్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయ స్వామి సొంత నియోజకవర్గంలో ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయకుండా గ్రామంలోని ఒకే చోట పంపిణీ చేశారు. సింగరాయకొండ మండలంలోని శానంపూడి గ్రామంలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. పాత సింగరాయకొండ గ్రామ పంచాయతీ మల్లికార్జున నగర్ ఎస్టీ కాలనీ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన అర్రిబోయిన రాంబాబుతో పాటుగా మరో ఇద్దరు ఉపాధ్యాయులను పింఛన్ల పంపిణీ విధులు కేటాయించారు. రాంబాబు టీడీపీ అనుబంధ సంస్థ అయిన టీఎన్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన శానంపూడి గ్రామంలోని రాముల వారి గుడి సెంటర్లో పింఛన్లు పంపిణీ చేశారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్లు అందజేయాల్సి ఉండగా ఆయన మాత్రం ఒకచోట ఉండి లబ్ధిదారులను అక్కడకు పిలిపించుకుని పింఛన్లు ఇచ్చేసి చేతులు దులుపుకున్నారు. ఇదిలా ఉండగా ఒంగోలులో 10 మంది బధిరులకు పింఛన్లు పంపిణీ చేయలేదు. గత నెలలో కూడా వారికి పింఛన్లు పంపిణీ చేయకపోవడంతో సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల మనసు కరగలేదు. ఒంగోలు మండలంలోని కరవదిలో 20 మంది వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు కూడా పింఛన్లు ఇవ్వలేదు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడిని ఒకసారి కలవమని ఒక ఉద్యోగి ఉచిత సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 2,88,144 మందికి గాను 2,79,365 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్డీఏ పీడీ వసుంధర తెలిపారు. మొత్తం 97.02 శాతం పంపిణీ చేసినట్లు వివరించారు.

రక్తదాతలు ఆపద్బాంధవులు

● మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం: రక్తదాతలు ఆపద్బాంధవులని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మార్కాపురంలోని డాక్టర్ సామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ యూనిట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆపదలో ప్రాణాలు నిలిపే రక్తదానం చేసేందుకు విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని ఎన్ఎస్ఎస్ పీఓ సురేష్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 35 మంది విద్యార్థులు రక్తదానంలో పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య తెలిపారు. డాక్టర్ సాయికిరణ్, సిబ్బంది, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సిబ్బంది రక్తదానంలో పాల్గొని సహకరించారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు

ఒంగోలు మెట్రో: మరో దివ్య తిరుమలగా ప్రసిద్ధి గాంచిన ఒంగోలు కొండమీద వెలసిన శ్రీగిరి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీవారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలను గురువారం నుంచి 12 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈమేరకు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణా రావు, ధర్మ కర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మి కుమారి వెల్లడించారు. 3వ తేదీ గురువారం సాయంత్రం ఆరు గంటలకు శ్రీవారి బ్రహ్మోత్సవాలకు కలశ స్థాపన నిర్వహిస్తారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక కార్యక్రమాలు అక్టోబర్ 10, 11, 12 తేదీల్లో జరుగుతాయి. 10వ తేదీ గురువారం ఉదయం 5 గంటలకు శ్రీవారికి తులసి దళాలతో సహస్రనామార్చన, సాయంత్రం ఏడు గంటలకు హనుమంత వాహన సేవ నిర్వహిస్తారు. ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారు. 11వ తేదీ శుక్రవారం ఉదయం ఐదు గంటలకు శ్రీవారికి శుక్రవార అభిషేకం, సహస్రనామార్చన, సాయంత్రం ఏడు గంటలకు శ్రీవారి ఊంజల సేవ జరుగుతాయి. శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వీవీఎస్, వినోద్ కుమార్చే భక్తి సంగీత విభావరి నిర్వహిస్తారు. 12వ తేదీ శనివారం ఉదయం శ్రీవారికి తోమాల సేవ, సహస్రనామార్చన నిర్వహిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు శ్రీవారి తిరు వీధి ఉత్సవం, అద్దంకికి చెందిన స్వర్ణ సుబ్బారావు బృందంచే కోలాట ప్రదర్శన జరుగుతాయి. భక్తులు శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి శరన్నవ రాత్రి బ్రహ్మోత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి ఆలయ నిర్వాహకులు కోరారు.

వల్లూరమ్మ ఆలయంలో ...



టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలలో ఈ నెల 3వ తేదీ నుంచి దేవి శరన్నవరాత్రులు ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారు ఈ నెల 3వ తేదీగా బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారని పేర్కొన్నారు. 4న గాయత్రీ దేవిగా, 5న అన్నపూర్ణాదేవిగా, 6న లలితా త్రిపుర సుందరీ దేవిగా, 7న మహా చండీదేవిగా, 8న శ్రీ మహాలక్ష్మిదేవిగా, 9న సరస్వతి దేవిగా, 10న శ్రీ దుర్గాదేవిగా, 11న - మహిషాసుర మర్ధినిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 9 రోజుల పాటు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పశ్చిమాన

గంజాయి గబ్బు..!

పశ్చిమ ప్రకాశం ముఖ్య కేంద్రమైన మార్కాపురం పట్టణం గంజాయికి అడ్డాగా మారింది. గత 25 రోజుల వ్యవధిలో 50 కిలోల గంజాయి పట్టుబడటమే ఇందుకు నిదర్శనం. అయితే పట్టుబడింది కేవలం ఒకటి రెండు శాతమేనని, పోలీసుల కళ్లు గప్పి రైళ్లు, కొరియర్లు, ఆటో డ్రైవర్ల ద్వారా నిత్యం గంజాయి రవాణా సాగుతోంది. ఈ ప్రాంతంలో గంజాయి వాడకం ఎక్కువగా ఉండటంతో గంజాయి రవాణాదారులు రోజుకో కొత్త మార్గంలో తరలిస్తున్నారు. గంజాయి తాగిన యువకులు ఆ మత్తులో నిత్యం బైక్‌రైస్‌లు, గొడవలకు సైతం దిగుతున్నారు.



- 25 రోజుల వ్యవధిలో 50 కిలోల గంజాయి స్వాధీనం
- అనుమానం రాకుండా రైళ్లలో సరఫరా
- రైల్వేస్టేషన్ నుంచి ఆటో డ్రైవర్ల ద్వారా రవాణా
- ప్యాకెట్ రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయం
- గంజాయి మత్తులో పట్టణంలో యువకుల హల్‌చల్

మార్కాపురం: గంజాయి..ఎంజాయ్ అంటూ యువతను టార్గెట్ చేసుకొని పశ్చిమ ప్రాంతంలో గంజాయి విచ్చలవిడిగా సరఫరా అవుతోంది. దీంతో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గతంలో ఎన్నడూ లేని విధంగా గంజాయి పట్టుబడుతోంది. గత నెల 23న మార్కాపురం పోలీసులు సుమారు 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. గతనెల 4న పెద్దారవీడు మండలం హనుమాన్ జంక్షన్ వద్ద ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 39 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌తో పాటు సమీప జిల్లాలైన నల్గొండ, ఏపీలోని పల్నాడు, గుంటూరు జిల్లాల నుంచి కొరియర్ల ద్వారా మార్కాపురానికి గంజాయి సరఫరా అవుతోంది. గుంటూరు నుంచి నంద్యాల, నంద్యాల నుంచి గుంటూరు వెళ్లే రైళ్లలో గంజాయిని పౌడర్‌గా ప్యాకెట్లలో చుట్టి మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ప్యాకెట్టు 150 నుంచి 200 రూపాయల వరకూ విక్రయిస్తున్నారు. నిర్వాహకులు కొంతమంది ఆటో డ్రైవర్లను రైల్వేస్టేషన్ నుంచి గంజాయిని తెచ్చేందుకు కొరియర్లుగా ఉపయోగించుకుంటున్నారు. పాత బస్టాండ్, ఏబీఎం కాంపౌండ్, పూల సుబ్బయ్య కాలనీ, అల్లూరిపోలేరమ్మ గుడి, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లోని కొన్నిచోట్ల గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు తెలిసింది.

25 రోజుల వ్యవధిలో 50 కిలోలు..

25 రోజుల వ్యవధిలో మార్కాపురం, పెద్దారవీడు మండలాల్లో 50 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకోవడం సంచలనం కలిగిస్తోంది. గత నెల 2న పెద్దారవీడు మండలంలోని హనుమాన్‌జంక్షన్ వద్ద, యాదాద్రి జిల్లా బోడుప్పల్‌కు చెందిన బొంత రమేష్, నల్గొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన మహేష్‌యాదవ్, నల్గొండ టౌన్‌కు చెందిన జావేద్, బెంగుళూరుకు చెందిన మహమ్మద్ అనీస్, పల్నాడుజిల్లా వినుకొండకు చెందిన గోపి, కె గౌతమ్ తదితరులు కుంట శివార్లలోని చర్చి వెనుక గంజాయిని కుప్పగా పోసి పంచుకుని అమ్ముకునేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు అరెస్టుచేశారు. గత నెల 22న మార్కాపురం శివర్లలోని గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద గుంటూరు సమీపంలోని అంకిరెడ్డిపాలెంకు చెందిన వడ్లమాను శివారెడ్డి, బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన దేవరకొండ శ్రీను, మార్కాపురం పట్టణంలోని విజయటాకీస్ వద్ద నివాసముండే సయ్యద్ మజీద్ దగ్గర నుంచి 20.4 కిలోల గంజాయిని మార్కాపురం సీఐ సుబ్బారావు, పట్టణ ఎస్సై సైదుబాబులు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు.

గంజాయి మత్తులో బైక్ రేసింగ్..

గంజాయి సేవించిన యువకులు మార్కాపురం పట్టణంలో రాత్రి 8 గంటల నుంచి మెయిన్ బజార్లలోనే బైక్ రేసులు నిర్వహిస్తున్నారు. 9గంటలు దాటితే తర్లుపాడు రోడ్డువైపు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. కొంత మంది గంజాయి బ్యాచ్ ద్విచక్ర వాహన దారులను అడ్డగించి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఒక్కో ప్యాకెట్‌ను రూ.150 నుంచి రూ.200 వరకూ విక్రయిస్తున్నారు. దినసరి కూలీలు, పలువురు ఆటో డ్రైవర్లు గంజాయిని సేవిస్తున్నారు. పోలీసులు స్పందించి గంజాయిని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

3 నుంచి టెట్ పరీక్షలు

- పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలి
- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



టెట్ పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్:

ఈ నెల 3 నుంచి 21వ తేది వరకు టెట్ పరీక్షలు జరుగుతాయని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. ప్రకాశంభవనంలో టెట్ పరీక్షల నిర్వహణపై మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4 కేంద్రాల్లో రెండు పూటలా ఉదయం 9.30 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో పరీక్షల ఉంటుందని తెలిపారు. పరీక్షకు జిల్లాలో 11,566 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయాలన్నారు. ఆన్‌లైన్ పరీక్ష కావడంతో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పండగ సీజన్ కావడం వల్ల ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని పరీక్ష రాసే అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఈఓ సుభద్ర, డిప్యూటీ డీఈఓ సుబ్బారావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వృద్ధులు భారం కాదు...

అనుభవాల గనులు



మాట్లాడుతున్న మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి



పాల్గొన్న వయోవృద్ధులు, ప్రజలు

● వయోవృద్ధుల దినోత్సవంలో మంత్రి స్వామి

ఒంగోలు అర్బన్: వయో వృద్ధులు మనకు భారం కాదని.. వారు అనుభవాల గనులని, అటువంటి వృద్ధుల పట్ల మనం గౌరవంతో మెలగాలని, వారి అనుభవాలను ప్రభుత్వం వినియోగించుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ఏఎస్పీ నాగేశ్వరరావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సమాజ అభివృద్ధిలో వారి సూచనలు తీసుకునేందుకు గ్రామస్థాయిలో సీనియర్ సిటిజన్స్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తుందన్నారు. ఇప్పటికే వృద్ధులకు ప్రభుత్వం నెలకు రూ.4వేల ఫించన్ అందజేస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ, వార్డుల్లో వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. వృద్ధుల సమస్యలు తెలిపేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 14567ను పునరుద్ధరిస్తామన్నారు. వృద్ధులకు అవసరమైన వినికిడి పరికరాలు, వీల్‌ఛైర్‌లు, చేతికర్రలు, కళ్లజోళ్లు ప్రభుత్వం తరుపున అందిస్తామన్నారు. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ వృద్ధుల అనుభవాన్ని వారి ఆలోచనల పరిపక్వతను తగిన రీతిలో యువతలో శక్తి సామర్థ్యాలు పెంపొందించి సమాజాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. బంగారు బాల్యం తరహాలో వృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధులకు అవసరమైన ఆర్థిక సుస్థిరత, ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఏఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ వయోవృద్ధులను గౌరవించుకోవడం మనందరి కనీస బాధ్యత అని అన్నారు. దీనిలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.రవిప్రకాష్‌రెడ్డి, ఎండీ ఎంఏ కుమార్‌రాజా, ఆ శాఖ ఏడీ అర్చన, ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ క్లబ్ అధ్యక్షుడు మాగులూరి నాగేశ్వరరావు, డాక్టర్ చలమయ్య, సీనియర్ సిటిజన్స్ నెప్పలి నాగేశ్వరరావు, జె.వెంకటేశ్వర్లు, పరమేశ్వర్‌రెడ్డి, లెక్చరర్ యామిని తదితరులు పాల్గొని వృద్ధుల సంరక్షణ, ఆవశ్యకత, ఓల్డేజ్ హోమ్ నిర్మాణం తదితర అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించారు. పెన్షన్‌లు పొందుతున్న వృద్ధులకు కార్యక్రమంలో పెన్షన్‌లు అందించారు. పలువురు వృద్ధులకు వినికిడి పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, సీపీఓ వెంకటేశ్వర్లు, ఇతర జిల్లా అధికారులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించం



విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విద్యార్థి యువజన సంఘాల నిరసన దీక్ష

● విద్యార్థి, యువజన సంఘాల హెచ్చరిక

ఒంగోలు టౌన్: ఎంతో మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ మంగళవారం కలెక్టరేట్ వద్ద విద్యార్థి, యువజన సంఘాల నాయకులు నిరసన దీక్షను నిర్వహించారు. విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయవద్దని, ప్రభుత్వ ఆధీనంలోని సెయిల్‌లో విలీనం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే నిరుద్యోగ సమస్య వేదిస్తుందని, విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే మరింత నిరుద్యోగం ప్రబలుతుందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు విద్యార్థి యువజనులు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పచెబుతుందని, బడా పారిశ్రామికవేత్తల కనుసన్నల్లో నడుస్తున్న మోదీ సర్కారును ఇంటికి పంపించకపోతే దేశంలోని యువతీ యువకుల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారవుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ విమర్శించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన విద్యార్థులు, యువజనులు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణానిధి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పిచ్చయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.కళ్యాణ్, బండి వీరస్వామి, విజయ్, కార్తీక్, అశోక్, యశ్వంత్, సీహెచ్ శ్యాం, పి. ప్రభాకర్, స్టాలిన్, సురేష్, రాము ,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

34 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితునితో ఎస్సై సిబ్బంది

పామూరు: అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండల సరిహద్దు ప్రాంతమైన తిరగలదిన్నె వద్ద జరిగింది. ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపిన వివరాలు... మండల సరిహద్దు తిరగలదిన్నె గ్రామం వద్ద ఉన్న ఫ్రెండ్స్ దాబాలో అక్రమంగా మద్యం ఉంచినట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో పామూరు అంకాళమ్మ వీధికి చెందిన తాతిరెడ్డి రమణారెడ్డి 34 మద్యం బాటిళ్లు కలిగి ఉండగా అతనిని అరెస్ట్‌చేసి అతని వద్ద నుంచి మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడు దుర్మరణం

టంగుటూరు: రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన స్థానిక టోల్ ప్లాజా సమీపంలో సోమవారం అర్ధరాత్రి 3 గంటల సమయంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సింగరాయకొండ గ్రామానికి చెందిన బురుసు చంద్రమోహన్ (25) ఒంగోలు వైపు నుంచి సింగరాయకొండ వెళుతుండగా టోల్ ప్లాజా దాటిన తర్వాత ముందు వెళుతున్న గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో చంద్రమోహన్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తన్నీరు ఏడుకొండలు తీవ్ర గాయాలపాలవడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నాగమల్లేశ్వరరావు

వివాహిత ఆత్మహత్య

మార్కాపురం రూరల్: తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ మానసికంగా కృంగిపోయిన ఓ వివాహిత వాస్మాయిల్ తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మార్కాపురం మండలం కొండేపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన భూపని పుల్లమ్మ (49) భర్త చనిపోవడంతో కూలి పనులకు వెళ్తోంది. ఆమె ప్రస్తుతం క్యాన్సర్ స్టేజ్ 2తో బాధపడుతూ రేడియో థెరపీ చికిత్స తీసుకుంటోంది. తీవ్రమైన అనారోగ్యంతో మనస్తాపం చెందిన ఆమె జీవితంపై విరక్తితో ఉదయం 7 గంటల సమయంలో ఇంట్లో వాస్మాయిల్ తాగింది. కొద్దిసేపటికి వాంతి చేసుకుంటుండటంతో ఆమె కుమార్తె గమనించి హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. దీనిపై మార్కాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

లండన్ చదువు పేరుతో టోకరా

- డబ్బు ఫీజులకు కట్టకుండా వ్యక్తిగతంగా వాడుకున్న ఘనుడు
- అతనితో పాటు బాధితురాలు కూడా లండన్‌లో చదువుతున్న వైనం
- తిరిగి ఇవ్వాలని అడిగితే నిందితుడి తండ్రి, సోదరుడు కలిసి బాధితురాలి తండ్రిపై దాడి

తాళ్లూరు(దర్శి): లండన్‌లో చదివేందుకు తమ కుమార్తె చదువుల ఫీజులు కట్టాలంటూ రూ.10 లక్షలు ఓ వ్యక్తి అకౌంట్‌లో వేస్తే ఫీజు కట్టకుండా వాటిని కాజేసిన సంఘటన మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామంలో మంగళవారం వెలుగు చూసింది. ఎస్సై ఎస్. మల్లికార్జునరావు తెలిపిన పూర్తి వివరాలు.. తుపాకుల వెంకటేశ్వర్లు తన కుమార్తె లండన్‌లో చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మీసాల కోటేశ్వరరావు కుమారుడు శివాజీ కూడా అక్కడే చదువుతున్నారు. ఈ క్రమంలో కుమార్తె ఫీజు కట్టాలంటూ శివాజీ ఖాతాకు రూ.10 లక్షలు జమ చేశారు. కానీ ఫీజు మాత్రం చెల్లించలేదు. దీంతో తిరిగి డబ్బులు ఇవ్వమని అడగ్గా ఆ డబ్బు ఇతరులకు కట్టానని.. వాళ్లు ఇచ్చినప్పుడు కడతానని చెప్పాడు. దీంతో శివాజీ తండ్రి మీసాల కోటేశ్వరరావు ఇంటికి వెళ్లి డబ్బు అడగ్గా .. మీసాల కోటేశ్వరరావుతో పాటు రెండో కుమారుడు మణికంఠ కలిసి వెంకటేశ్వర్లుపై దాడిచేయగా గాయాల పాలై ఆసుపత్రిలో చేరాడు.

స్వర్ణాంధ్ర సాధనకు

అందరి భాగస్వామ్యం అవసరం

● ఏ.కే.యూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్




స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో ఏకేయూ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్

ఒంగోలు: స్వర్ణాంధ్ర-2047 సాధన కోసం ప్రతి పౌరుడు శ్రమించాల్సిన అవసరం ఉందని, ఇందు కోసం యూనివర్శిటీ పరిధిలో ఉన్న అధ్యాపకులు, విద్యార్థులు సమష్టిగా పనిచేసి ప్రభుత్వ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజ మోహన్ రావు అన్నారు. స్థానిక ఏ.కే.యూ. సమావేశపు హాలులో స్వర్ణాంధ్ర 2047 అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 2047 సంవత్సరం నాటికి భారతావనికి స్వాతంత్ర్యం సిద్ధించి 100 సంవత్సరాలు పూర్తి అవుతుందని, ఆ సమయానికల్లా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాన్ని చేపట్టి నిర్దేశించుకున్న లక్ష్య సాధనకు 12 సూత్రాలను ప్రతిపాదించినట్లు ఆయన పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నిర్మలా మణి మాట్లాడుతూ భావి తరాలకు అవసరమైన అన్ని సౌకర్యాలను అభివృద్ధి పరుచుకునేందుకు వీలుగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్టూడెంట్ అఫైర్స్ విభాగం డీన్ డాక్టర్ అంచల భారతీ దేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో పాటుగా ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు.

90 శాతం రాయితీపై మినీ గోకులాలు

● పశుసంవర్థక శాఖ జేడీ బేబీరాణి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీ బేబీరాణి

నాగులుప్పలపాడు: పాడి రైతులకు 90 శాతం సబ్సిడీపై మినీ గోకులాలు ఇస్తున్నామని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డా.బేబిరాణి అన్నారు. మండలంలోని పోతవరం, నాగులుప్పలపాడు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తుందిలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ మిశ్రమ దాణా రూ.6.50లకు సబ్సిడీపై అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే పశువులకు బీమా చేయించుకోవడం ద్వారా ఏదైనా కారణంతో పశువు చనిపోతే నష్టపరిహారం పొందవచ్చన్నారు. ఏఓ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి రైతు మూడేళ్లకు ఒకసారి తప్పనిసరిగా భూసార పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి శనగ విత్తనాలు 25 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తామని తెలిపారు. సబ్సిడీ పోను కేజీకి రైతులు జేజీ-11 రకం రూ.70.50, కాక్ 2 రకం రూ.90.75 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో రైతులకు వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై అందించాలని అధికారులను కోరారు. సమావేశం అనంతరం రైతులతో కలిసి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ జాస్మిన్, రైతులు ఉన్నారు.